

మహాభారత యుద్ధసూచనలు రాజసూయయాగంలో కనబడిన విధం – కంకణపురంలో ధర్మఆసుపత్రి తెరిచేనాడు ముందు జరగబోయే తగువుకు సూచనలు కనబడినవి. కంకణపురం మదించిన గ్రామం – డబ్బులో. పూర్వ మెప్పుడో లక్ష్మి ఆ దోవను పోతుండగా చేతికంకణం జారి కింద పడిందనీ, ఆ కంకణంమీది మమతతో ఆమె ఆ గ్రామం వదిలిపెట్టకుండా ఉన్నదనీ వాడుక. ఆ కంకణాన్ని బట్టి ఆ వూరుపేరు కూడా కంకణపుర మైందని ప్రతీతి. ఏది ఏలాగున్నా ఆ ఊరి ముఖర్జీగారంటే దేశమంతటా తెలుసు. అనేకమంది జమీందారులే వారిదగ్గర ఋణంతో కట్టుబడ్డారు – వారు జమీందారులని వేరే చెప్పడ మెందుకు?

*   *   *

ముఖర్జీగారి కుటుంబం చాల పెద్దది. అంతమాత్రంచేత వారి ధన మేమీ తగ్గలేదు. సంతానవృద్ధితోపాటు వడ్డీ కూడా పెరుగుతూనే ఉంది. లోకులు, ముఖర్జీగారి పెట్టెలో రూపాయలు పిల్లలను పెడతవని అంటారు. కాని అది అబద్ధం. వారికి వడ్డీమీదే లక్షల ఆదాయ మొస్తుంది.

ఇంతమంది డబ్బున్నవా రున్న ఆ గ్రామంలో స్కూలుగానీ, ఆస్పత్రి గానీ లేదు! ఆఖరికి జిల్లా కలెక్టరు గారు ఆ ఊరి గ్రామస్థులను ప్రోత్స హించి, చందాలు వేయించి ఈ ఆస్పత్రి కట్టించారు. ఇప్పుడు దానిదే ప్రారం

చక్రపాణి

భోత్సవం. పందిళ్లూ, పాకలూ వేయించారు. జడ్జి, మేజస్ట్రేటు దగ్గరనుంచి సబ్ ఇన్‌స్పెక్టరు వరకూ ఉద్యోగస్థులంతా వచ్చారు. బ్యాండు మేళం, పూలమాలలు, స్వాగతాలు అన్నీ అయినవి. వుద్యోగస్థులూ, ముఖర్జీగారి కుటుంబంలోని పెద్దలూ కుర్చీలమీద వరుసగా కూర్చున్నారు.

ఇక ఉపన్యాసపర్వం మిగిలింది. అంతా చప్పట్లు కొట్టేవారే గాని మాట్లాడేవాళ్లు ఒక్కళ్లుకూడా లేరు. చివరకు జిల్లాకోర్టులో క్రిమినల్ ప్రాక్టీసు చేస్తున్న ప్లీడరుగారొకరు లేచి ముఖర్జీగారి వంశాన్ని కల్పవృక్షముతో పోల్చి కాసేపుమాట్లాడి అక్కడివారి పరువు నిలిపాడు. ఆ సభకు అధ్యక్షులు సబ్‌జడ్జిగారు. ఆయన సభనుద్దేశించి, 'ఇంకెవరైనా మాట్లాడతారా?' అని అడిగాడు. ఎవ్వరూ లేవలేదు. రెండుమూడుసార్లడిగి ఆయన ప్లీడరువినోదబాబును ఏమన్నా మాట్లాడమని బలవంతపెట్టాడు.

వయస్సులో కొంచెం తేడా ఉన్నప్పటికీ వినోదబాబూ, జడ్జిగారూ చాలా స్నేహితులు. ఎంతకాదన్నా అతను లేచి మాట్లాడక తప్పలేదు. ఉత్తరీయం పైన వేసుకుని లేచి ఇలా ఉపన్యసించాడు:

"అధ్యక్షా, సోదర సోదరీ మణులారా!

"బిడ్డ పుట్టంగానే నోట్లో తేనె వేస్తారన్న సంగతి మీ కందరికీ తెలిసే ఉండవచ్చు. మా అమ్మ నాకు వేపపూలనించి తీసిన తేనె వేసిందట. అందుకనే నా మాటలు కొంచెం కటువుగా ఉంటై. ఈ కారణంచేతనే నేను మాట్లాడటానికి సందేహించాను. నిజానికి చేదుకూడా షడ్రుచులలో ఒకటి; శరీరానికి అవసరమైందికూడా. అందుకనే ఉగాదికి దీన్ని మనం తింటూ ఉంటాము. ఇక అసలుసంగతికి వద్దాము. జమీందారుగారు ఈ గ్రామంలో ధర్మఆసుపత్రి నెలకొల్పటం అందరికీ సంతోషంగా ఉండవచ్చు-నిజానికి ఉండవలసిందే కాని, నాకిది గోవును చంపి దాని తోలుతో చేసిన చెప్పుల్ని దానం చేసినట్టుగా ఉంది. ఈ జమీందారుగారే చెరువునీరు అకట్టి రైతుల పొలాలు సాగు కానివ్వలేదు. పైగా పన్ను తప్పదు వాళ్ళకి. ఇవ్వటం ఆలస్యమైతే దానికి వడ్డీ కట్టి, వసూలు కాకపోతే ఇల్లూ వాకిలీ జప్తు చేసీ—"

సభలో గుసగుసలు బయలుదేరినై. జమీందారు వంశీకుల ముఖాన నవ్వు మాయమైంది. ఒకరి మొహం లొకరు చూసుకోసాగారు. సభ కొచ్చిన పెద్ద మనుష్యులకుకూడా ఈ ప్రసంగం బాగాలేదు. వినోదబాబు అప్పటికే నోరు జారాడు. ఆపడాని కెవరివల్లా కాలేదు.

"నాకు ముందు మాట్లాడిన ఉపన్యాసకుడు వీరిని కల్పవృక్షంతో పోల్చాడు. వీరిని తమాషా చేయటానికే అలా అన్నాడేమోనని నాకు తోస్తున్నది. ఎందుకనంటే, గగనకుసుమం మాదిరిగా కల్పవృక్షం కూడా కల్పనా ప్రపంచానిది. నా ఉద్దేశంలో వీరిని ఒక ఖర్జూరపుచెట్టుతో పోల్చవచ్చును. అదికూడా మెసపొటోమియా చెట్టుతో కాదు; మన నాటు చెట్టుతో! దానికిందకు పోతే మనకు నీడ దొరకదు. పళ్ళా- ఉత్తవిత్తులే! ఆలింగనం చేసుకుందామా శరశయ్యే. కాని కొడవలితో బెజ్జం పెట్టితే మాత్రం రసం కొంత కారతుంది. ఈరోజున జిల్లాకలెక్టరుగా రనే కొడవలి ఆపనే చేసింది. దాని కృపవల్ల నప్పికతో నాలుక పిడచకట్టుకు చచ్చిపోతున్న కంకణపురవాసులకు తలా ఒకబొట్టు రసం లభించింది. అందుచేత నేను కొడవలికీ ఖర్జూరపుచెట్టుకీ రెంటికీ ధన్యవాదా లర్పించి ఇంతటితో విరమిస్తున్నాను."

వినోదబాబు కూర్చున్నాడు. కుర్రవాళ్ళు మాత్రం ఒకరిద్దరు ఉత్సాహంతో చప్పట్లు చరిచారు. కాని పెద్దవాళ్ళెవ్వరూ వాళ్ళని అనుసరించలేదు. సభ అంతా నిశ్శబ్దమైంది. ఉపన్యసించటాని కెవ్వరూ లేవలేదు. జమీందారులు తలవంచుకుని అపుకున్న కోపాన్ని త్రాచుపాము బుసమాదిరిగా బయటికి కక్కారు. సభ ఏదో విధంగా అయిపోయింది. అంతా వెళ్ళిపోయారు. అప్పుడు జమీందారులు కూడా తల ఎత్తారు త్రాచుపాముల్లాగానే. వినోదుని వంశాన్ని ధ్వంసం చేస్తామని ప్రతినకూడా పట్టారు- తడుకుడిలాగా!

ఈ వార్త వినగానే వినోదుడు రెండు చేతులూ పైకెత్తి దణ్ణం పెట్టాడు వార్త తెచ్చిన జడ్జిగారు "ఎవరికోయ్ దణ్ణం, జమీందారుగారికేనా?" అన్నాడు.

"కాదు, దుర్వాసుడికి," అన్నాడు వినోదుడు.

"అంతా నిన్నే అంటారే, కలియుగ దుర్వాసుడని!"

"నేనే దుర్వాసుణ్ణయినట్టయితే లక్ష్మీ దంబాన్ని ఎప్పుడో పోగొట్టేవాణ్ణి."

* * *

వినోదుడు నిర్మొహమాటి, లౌక్యముగా మెలగటం అతనిచేత కాదు. మొట్టమొదట ఇతను బి. ఏ. ప్యాసు కాగానే స్కూలుమాస్టరుగా చేరాడు. శిక్షణపద్ధతిలో ఒక ఆదర్శాన్ని నెలకొల్పాలని ఇతని ఉద్దేశం. ఈ ఉద్దేశం ఉండటంవల్లనే మాస్టరుపని వదిలి ప్లీడరు కావలసివచ్చింది.

వీరి స్కూలు ప్రెసిడెంటుగారు

దేవీపూజ చేస్తూ అందరికీ భోజనాలకు చెప్పారు. వినోదుని భార్యకూడా వెళ్ళింది. కాని ఈమె భోజనాలదగ్గర తనను తదితర ధనిక స్త్రీలతో, నగ లున్నవారితో సమానంగా చూడ లేదని ఇంటి కొచ్చినాక భర్తతో ఏడుస్తూ చెప్పింది. వినోదుడు మండి పడి, మాస్టరుపనికి రాజీనామా ఇచ్చి, సెకండరీగ్రేడు ప్లీడరుపరీక్ష ప్యాసై ప్రాక్టీసు పెట్టి డబ్బు సంపాదించి, రెండు సంవత్సరాలైనాక ఆ గ్రామం పోయి కసి తీర్చుకున్నాడు.

వినోదుడే కాదు, అతని తండ్రి తాతలుకూడా పొగరుబోతు లన్న ఖ్యాతి వున్నది. అతని తాత ఒకమాటు శ్రాద్ధం చేయించటానికి పోయాడు జమీందారు గారింటికి. జమీందారు గారు ఏదో మాటసందర్భంలో 'జదా జదాహి ధమ్మస్స' అనగా, ఈయన "అలాకాదు, 'యదాయదాహి ధర్మస్య' అనాలి. నీకు నాలిక బొత్తుగా తిరగటం లేదు" అన్నాడు. ఇదీ అతని స్వభావం. వినోదుని తండ్రి కాశీప్రసాదుడు. ఇతని తండ్రి అంత పండితుడు కాదు. సమాజంలో అంత ప్రతిష్ఠకూడా లేదు ఈయనకి. కావాలని ఎప్పుడూ పాకు లాడనూ లేదు. ఇంట్లోనించి ఎప్పుడూ బయటికి వచ్చేవాడేకాదు. అయినా 'అతని కెంత అహంకారం!' అనే వాళ్లు ఊళ్ళోవాళ్ళు. ఇవన్నీ వెనకటి సంగతులు; వీటిని పోనివ్వండి.

వినోదుడు జమీందారుగారి ప్రతిజ్ఞ విని ఏమీ భయపడలేదు. ఇటు కంకణ పురం జమీందారులు తమ ప్రయత్నం లోనే ఉన్నారు. చారులు పోయి జాడలు తీసి 'వినోదబాబు ఎవ్వరికీ బాకీ లే' దని చెప్పారు. ఎక్కడన్నా బాకీ ఉంటే నోటు ఆర్డరు వేయించు కుని కంప్లెయింటు చేయాలని వీరి ఉద్దేశం. ఇక గత్యంతరంలేక జమీం దారు "కమలపురం జమీందార్ల స్థితి ఎలా ఉంది," అని వెళ్ళిన అతన్ని అడి గాడు.

కమలపురం వినోదబాబు సొంత ఊరు. అక్కడనే ఇతని పొలం ఉంది.


"ఇద్దరు భాగస్తులుమాత్రం కొంచెం ఎత్తుపడ్డారు. మిగతావారి స్థితి బాగానే ఉంది," అన్నాడు చారుడు,

"ఐతే, కాస్త ఎక్కువైనా సరే వాళ్ళ భాగాలు కొనేసెయ్యి. ముందు అక్కడ ఉన్న మన అనుకూలురను కూడా విచారించు."

* * *

నాలుగు మాసాలు గడిచినై.

ఒకనాటి సాయంత్రం వినోదబాబు సంధ్యావందనం చేసుకుంటూఉండగా భార్య వచ్చి కమలపురంనించి జగ్గా వచ్చాడనీ, వాడిని కంకణపురం జమీం దారుగారి నౌకర్లు కొట్టారనీ, వాడు ఏడుస్తున్నాడనీ చెప్పింది. వినోద బాబు అప్పుడేమీ మాట్లాడలేదు. జపం




పూర్తి అయినాక ఇంట్లోకి వచ్చి భార్య నడిగి పాలు తెప్పించుకుని తాగి, భగవంతుని ధ్యానించేటప్పుడు అలా పిలవకూడదని భార్య కుపదేశించి, కచేరీ చావిట్లోకి వచ్చాడు. వారిని చూడగానే జగ్గూ కాళ్ళకు చుట్టుకుని భోరున ఏడ్వసాగాడు.

"ఏమిటి, సంగతేమిటి?" అన్నాడు వినోదబాబు జగ్గూను లేవదీస్తూ.

వాడు లేవనూ లేదు, ఏడుపు మాననూలేదు. తర్వాత నాలుగుసార్లు గద్దించినమీదట, జగ్గూ లేచి కళ్ళు తుడుచుకుంటూ "గుంటలో ఈ ఏడు మంచిమంచి చేపలు—"

"మంచిసంగతి తర్వాత చూడొచ్చు— అసలు చేప లేమైనై?" అన్నాడు వినోదబాబు.

"జబర్దస్తీ చేసి పట్టించుకెళ్ళారు."

"తర్వాత?" దీనికి జగ్గూ జవాబివ్వలేదు. వినోదుడు మళ్ళీ అడిగాడు.

"ఏమి చేశారు?"

"నా గొడ్డూగోదలు తోలుకెళ్ళి బందెలదొడ్లో పెట్టారు."

"ఇంకా?"

జగ్గూ ఈ మాటు మళ్ళీ ఏడుపు తెచ్చుకొని — "నౌకర్లచేత నన్ను తన్నించి—" జగ్గూ ఇక మాట్లాడలేక పోయాడు.

"సరే, వాళ్ళు నిన్ను తన్నించిన దెందుకో తెలుసునా?"

జగ్గూ కన్నీరు తుడుచుకుంటూ అన్నాడు: "'ప్లీడరుగారి భూమి నువ్వు పాలుకు చేస్తున్నావట నిజమే నా? అలాగయితే వదలిపెట్టు. ఈ ఊళ్ళో

ఎవ్వరూ ఆ భూమి చెయ్యటానికి వీల్లేదు,' అన్నారు జమీందారుగారొచ్చి. 'అదెలాగండి? మూడుతరాల నించీ మేమే వారి భూమి సాగుచేస్తూ వస్తున్నాము. ఇప్పు డెలా మానుకోగలం,' అన్నాను."

జగ్గూ మళ్ళీ ఏడవడం ప్రారంభించాడు.

వినోదబాబు కాసే పాలోచించి "జగ్గూ! నువ్వు చార్జి పెట్టు, నీకు రానూ పోనూ ఖర్చులూ, కోర్టు ఖర్చులూ అన్నీ నేనే భరిస్తాను. నువ్వీ రాత్రల్లా ఆలోచించుకుని రేపు పొద్దున్న నాకు ఏమాటా చెప్పు; లేదా నీకు భయంగా ఉంటే నాపొలం నాకు వదిలిపెట్టు. నువ్వుపడ్డ నష్టం నేను యిస్తాను."

"బాబూ, ఏదో చేపల భాగ్యానికి—"

వినోదబాబు వాడిని కోప్పడలేదు; విసుక్కోనూలేదు. భోజనం చేయమని ఇంట్లోకి పంపాడు. ఆరోజునే వినోదబాబు "ఈ రోజునుండి మన ఇంట్లో లక్ష్మిని పూజించటానికి వల్లకాదు!" అని భార్యతో చెప్పాడు.

భార్యకు ఆశ్చర్య మేసింది, కాని భర్త ధోరణి చూసి ఎదురాడలేక పోయింది.

* * *

చార్జి దాఖ లయింది.

వినోదబాబు తన తర్కశక్తినంతా ఉపయోగించి తెలివిగా కేసును నడపటంవల్ల సత్యం బయటపడింది. జమీందారుగారి గుమాస్తాకూ నౌకరుకూ శిక్షపడింది. ఈకేసు తీర్పుతో దేశమంతటా గోల పుట్టి పోయింది. జమీందారు జిల్లాకోర్టులో అపీలు చేయించారు.

ఆవాళ సాయంత్రం సబ్ జడ్జిగారొచ్చి వినోదునితో "వినోదబాబూ! అయిన రగడచాలు. మీతగవు ఇంతటితో చంపుకోండి," అని సలహా యిచ్చాడు.

"ఏమిటీ మీ రన్నది?" అన్నాడు ఆశ్చర్యంతో వినోదబాబు.

"మంచిమాటే చెప్పాము. మీ తగవు ఇంతటితో తేలదు; జిల్లా కోర్టుకు కూడా పోతారు, హైకోర్టుకుకూడా పోతారు. వారి కేం? వారింట్లో లక్ష్మి తాండవమాడుతోంది."

"అసలు నా విరోధమే ఆమెతో. మనుషుల నెత్తిమీదగా నడవటం ఆ దేవతకు అలవాటైపోయింది. ఆమె కాళ్ళు నేలమీద పెట్టించిగానీ నేను వదలను."

"ఛీ, అలా అనవచ్చునండీ!"

"మీకు రుచించలేదు, నే నేమి చేయను!" అని మందహాసం చేసి"ఐనా ఎలా రుచిస్తుందిలెండి. మీ తలమీద కూడా లక్ష్మి ఎక్కి తొక్కుతున్నది. ఆమె కాళ్ళరాపిడికే బొచ్చుఅంతా రాలిపోయింది!" అన్నాడు వినోదుడు.

సబ్ జడ్జీగారిది బట్టతల. అయన ఈ సరసానికి పకపక నవ్వాడు; అతని యుక్తికి మెచ్చుకున్నాడు కూడా. తర్వాత లోకాభిరామాయణంతో ఆ సాయంత్రం గడిచిపోయింది.

కాని, వినోదబాబు అనుకున్నంత తేలికగా లక్ష్మి ఓడిపోలేదు. జిల్లా కోర్టులో కేసు కొట్టివేశారు. వినోద బాబు ముఖం కందగడ్డలా చేసుకుని జిల్లానించి తిరిగివచ్చాడు. సత్యమిలా పరాజయం పొందటం చూసి అతను క్షోభేకాదు, సిగ్గుకూడా పడ్డాడు.

ఇంటికొచ్చి దుస్తులు మార్చి సంధ్యా వందనం చేయటానికి కూర్చోగానే బయట తప్పెట్ల మోత వినపడింది. కాసేపటికీ భార్య విస్మయంతో పరు గెత్తుకుంటూ వచ్చి "ఏమండోయ్! జమీందారుగారు మన వాకిటిముందు తప్పెట్లు వాయించమని మాదిగ వాళ్ళని పంపారట. వాళ్లు తై, తై మని చిందులేస్తున్నారు," అన్నది.

వినోదబాబు అతీపతీ చెప్పలేదు. నిర్వికారంగా కూర్చున్నాడు.

తర్వాత ఒకమాసానికి కంకణపురం జమీందారులు ఇంటిదగ్గర పెద్ద ఉత్సవం చేశారు. కురుక్షేత్రయుద్ధంలో ఓడి, దుర్యోధనుడు ద్వైపాయన హ్రదం (మడుగు)లో దాక్కున్నప్పుడు కూడా పాండవులింత ఉత్సవం చేయలేదు. వినోదుడు రామపురంలో ప్రాక్టీసు వదిలి కలకత్తా పారిపోయి నందుకే వీరి ఉత్సవం చేసింది. ఇందులో ఇంకో ప్రతిజ్ఞకూడా చేశారు: "ముండాకొడుకుని తప్పెట్లు వాయించి తాలూకానించి వెళ్ళ గొట్టాము. ఈ తఫా తాళాలు వాయించి ఊరినించికూడా వెళ్ళ గొడతాము."

వారిలో ఒకాయన "ముందు జగ్గూగాడిపని పడదా," మన్నాడు. అంతా ఆమోదించారు.

*　*　*

దాదాపు మూడుసంవత్సరాలకు కంకణపురం జమీందారు పట్టిన ప్రతిజ్ఞ నెరవేరటానికి సిద్ధమైంది. జగ్గూపని అంతా అయిపోయింది. ఇంకా ఊరు వదలిపెట్టలేకుండా ఉన్నాడు. కాని జమీందారుగారి పాదాలమీద మాత్రం పడలేదు.

ఒకరోజున గ్రామపెద్ద వచ్చి - "ఒరే, పోయి బాబుగారి కాళ్ళమీద పడరా. నీళ్ళల్లో ఉంటూ మొసలితో విరోధం పెట్టుకుంటే ఎలారా!" అని జగ్గూకు సలహా యిచ్చాడు.

"మొసలితో విరోధం పెట్టుకున్నా తింటుంది; పెట్టుకోకపోయినా తింటుంది. అంతకంటే విరోధం పెట్టు కుని చావటం మంచిదికాదా?" అన్నాడు విసుగెత్తిన జగ్గూ.

"పెద్దమ్మవారు నెత్తిమీ దున్న

ప్పుడు ఇలా గే పలికిస్తుందిలే!" అన్నాడు గ్రామపెద్ద.

"పెద్దమ్మవారే మంచివి అందరి కంటే. ఒకమాటు చేరిందంటే ఇక వదలిపోదు."

"నిన్ను అనే దేముందిరా! ఆ జమీందారు-"

"జమీందారుకాదు - రాక్షసుడు, ఛండాలుడు-"

ఇది జరిగిన రెండురోజులకు జగ్గూ పూరిగుడిసెకు నిప్పంటుకున్నది. వాడి భార్యాపిల్లలూ కీసరబాసరమని అరవటంవల్ల చుట్టుప్రక్కలవాళ్ళంతా పోగయ్యారు. జగ్గూ తగలబడిపోతున్న ఇంటివంక కన్నెత్తికూడా చూడలేదు. తాను పట్టుకున్న మనిషి రొమ్ముమీద ఎక్కికూర్చున్నాడు. తర్వాత అంతా వచ్చి జగ్గూను లేవదీశారు, బలవంతముగా. వాడే జగ్గూ ఇంటికి నిప్పు పెట్టింది. జమీందారు నౌకరు. జగ్గూ వాడిని పోలీసులకు వప్పజెప్పాడు.

మర్నాడు జగ్గూ గుడిసెనిప్పుతో చుట్టకాల్చుకుని చెట్టుక్రింద కూర్చుని ఉండగా జమీందారుగారి గుమాస్తా వచ్చి "జగ్గూ!" అని పిలిచాడు.

జగ్గూ పిచ్చివాడిలాగా "ఎందుకొచ్చావ్! ఫో. నువ్వేమిస్తానన్నా నేను రాజీపడను," అని అరిచాడు.

"కాదోయ్! మంచిమాట చెప్తాను," అన్నాడు గుమాస్తా నవ్వుతూ.

"ఉన్న గుడిసెకూడా పోయింది. నన్నేమి చేస్తావ్!" అన్నాడు జగ్గూ వెటకారంగా.

తర్వాత రెండురోజులకు వినోదబాబు గుమస్తా వచ్చి జగ్గూను రామపురం తీసుకెళ్ళాడు.

ఆ మధ్యాహ్నమే వినోదబాబు వకీలుగౌను వేసుకుని జగ్గూను వెంటపెట్టుకుని డిప్యూటీకలెక్టరు ఆఫీసులో మొట్టమొదట అడుగుపెట్టాడు. ఇన్నాళ్ళనించీ ఆతను కలకత్తాలో ఉండి లా చదువుతున్నాడు.

ఈమాటు కంకణపురం జమీందారులు కొంచెం గాభరాపడ్డారు. వినోదుడు కోరిన ప్రకారం కలెక్టరుగారు తగులబడ్డ చోటూ వగైరాలు స్వయముగా చూసిపోయారు. తర్వాత జమీందారుగారి మేనేజరు, గుమస్తా, నౌకరు - ముగ్గురిమీదా కేసు నిలిపి సెషన్సుకోర్టుకు విచారణకు పంపారు. వినోదుడుకూడా జిల్లాకు పోయి కూర్చుని, కేసు నడపటంలో పబ్లిక్ ప్రాసిక్యూటరుకు సహాయపడసాగాడు. ఈ లోపున జమీందారుగారి తరఫున అనేకమంది రాజీకి వచ్చారు. ఎన్నో ఆశలు పెట్టారు వినోదుడికి. కాని అతను లొంగలేదు. "భాగ్యవంతులకూ, బీదలకూ విరోధం లేకుండాపోతుందా? అసంభవం!" అన్నాడు. వచ్చిన మధ్యవర్తులు మరీ బలవంతం చెయ్యగా

వినోదుడు రాజీకి రెండు షరతులు పెట్టి అందులో ఒకటి-తమయిష్టమొచ్చింది-నెరవేరుస్తే చాలు నన్నాడు.

1. జమీందారు తప్పెట మెడకు తగిలించుకుని కోర్టుముందు వాయించాలి.

2. తగులబడిపోయిన జగ్గూగ డిసె జమీందారు స్వయంగా కప్పాలి.

రాజీకి వచ్చిన మధ్యవర్తి ముఖం మాడ్చుకుని వెళ్ళిపోయాడు. కేసు విచారణకు వచ్చింది. గవర్నమెంటు ప్లీడరు అనుమతితో వినోదుడే సాక్షులను ప్రాసుచేశాడు. వారి నోటినించే తగువు ఆరంభమైనప్పటినించీ గుడిసె తగలబెట్టినంతవరకు జరిగిన సంగతులన్నీ చెప్పించాడు. సాక్ష్యంలో ఎక్కడా పొల్లుమాట రాలేదు. సాక్షుల విచారణ అయినతర్వాత వినోదుడు కోర్టు కిలా చెప్పాడు :

"నేడు ప్రపంచమంతా ధన మదంచే విర్రవీగుతున్న ధనికుల ధాటికి తాళలేకుండా ఉన్నది. ఇప్పుడు విచారణలో ఉన్న కేసుకూడా దాని కొక దృష్టాంతము. ఇంతకూ మనం చింతించవలసిం దేమంటే — ఈ ధనికులు చేసే దుర్మార్గాలకుగాను వారి ననుసరించుకుని ఉన్న బీదలే శిక్ష అనుభవిస్తూ ఉండటం. కాని, వీ రిక్కడ తప్పుకుపోయినా ఇంకోచోట తప్పక వీరి విచారణ జరుగుతుంది. అక్కడ వీరు తప్పుకునిపోలేరు. భగవంతుని పుత్రుడైన యేసుక్రీస్తు ఏమని సెల విచ్చాడంటే — ధనికులు స్వర్గరాజ్యం ప్రవేశించటం కంటే, ఒంటె సూది బెజ్జంగుండా దూరిపోవటం తేలిక,'' అని.

వినోదబాబు మాట్లాడినమీదట గవర్నమెంటు ప్లీడ రిక మాట్లాడ వలసిన పని లేకుండాపోయింది. ముద్దాయీలకు కఠినదండన విధింపబడింది. తీర్పు అయి వినోదుడు బయటకు రాగానే, గుమాస్తా వచ్చి, 'ముగ్గురు క్లయింట్లు తమకోసం వేచిఉన్నా' రని చెప్పాడు. వినోదుని బుర్రలో ఇంకా వెనకటి కేసే తిరుగుతున్నది. ఏమీ మాట్లాడలేదు. గుమాస్తా అన్నాడు :

"ఒకటి — బెంచీ కోర్టులో; రెండు— మేజస్ట్రేటు దగ్గర. ఫీజు ఒక్కొక్క దానికి నాలుగురూపాయలు.

వెనుకనించి వినోదుని పాత మిత్రుడు, సెకండరిగ్రేడు ప్లీడరు వచ్చి వినోదుని వీపు చరిచి అన్నాడు: "భలే బాగా చెప్పావోయ్, ఆర్గ్యుమెంటు! ఇక పాతవేష మంతా మార్చిపారేయి. నా దగ్గ రొక కేసుంది: నీ కిప్పిస్తాను. కాని అతను బీదవాడు."

"పంపించు; నేను డబ్బుకోసం చూడను," అన్నాడు వినోదుడు.

* * *

అసలీ ప్రపంచమే విచిత్రమైంది.

కాని, అందులో జరిగే ఘటనలు అంత కంటే విచిత్రమైనవీ, విస్మయకరమైనవీ. ఇలాంటి చిత్రమైన ఒక ఘటన వల్లనే కంకణపురం జమీందారులకూ, వినోదునికీ తగు వొచ్చింది. ఇలాంటి చిత్రమయిన ఇంకో ఘటనవల్లనే ఆ తగువు ఎంతో ముదిరినాక చప్పున సమసిపోయింది.

పదిహేను సంవత్సరాలు గడిచాయి.

ఒకనాడు కంకణపురం జమీందారుల జోడుగుర్రాల బగ్గీ వచ్చి వినోద బాబు గేటుముందు నిలిచింది బండిలోనించి జమీందారూ, ఆయన పెద్ద కొడుకూ దిగారు. వాకిటి దగ్గరున్న బంట్రోతు వారికి సలాం పెట్టి గేటు తెరిచాడు. వారు హాలులోకి పోగానే, ఇద్దరు నౌకర్లు వచ్చి సోఫాలు దులిపి, ఎడంగా నుంచున్నారు. పెద్దాయన ఒకమాటు ఇంటివంక తేరిపార చూసి, "అరే మన వినోదుడి ఇల్లు ఇంద్ర లోకంలాగా ఉందే!'' అన్నాడు. ఆయన కొడుకు నౌకరుతో "పోయి, మీ బాబుగారితో కంకణపురం జమీందారుగారు వచ్చారని చెప్పు!" అన్నాడు.

కబురు విని వినోదుడు ఆశ్చర్యపోయి, చాలా ఆదుర్దాతో దిగివచ్చి, "దయచెయ్యండి, దయచెయ్యండి. ఇవ్వాళ నాకు సుదినం." అన్నాడు.

"నువ్వు పిలవకుండానే వచ్చామోయ్ మేము. ఇప్పుడు కూర్చోనిస్తావో వెళ్ళగొడతావో చెప్పు," అన్నాడు పెద్దాయన.

"అలా చెయ్యగలనండీ! నా వల్ల అవుతుందా?" అన్నాడు వినోదుడు.

పెద్దాయన మందహాసం చేసి "ఇవ్వాళ నిన్ను కొన్ని ప్రశ్నలడుగతాను. ఈ జిల్లా కంతా నువ్వు పేరు మోగిన ప్లీడరువుకదా! సమాధానాలు చెప్పు!" అన్నాడు.

"అలాగే. ముందు కూర్చోండి.''

"ఇదిగో, మేము నీ ఇంటికి బిచ్చానికి వచ్చామనుకో. నువ్వు బిచ్చం వేయంది కూర్చోబెట్టి మాత్రం ఏం లాభం?"

"మీరు నన్ను బిచ్చమడగడమేమిటి? నమ్మదగింది కాదు. బలిచక్రవర్తిని వామను డడిగినటువంటి బిచ్చం కాదుకదా! సరే, ముందు మీరు కూర్చోండి ''

"కాదు. ముందు వేస్తానంటే కూర్చుంటాము. లేకపోతే పోతాము."

"అలాగే, చెప్పండి. నావల్ల ఐతే కాదనను."

"నా మనమరాలికి నువ్వు ఆశ్రయమివ్వాలి."

చిన్న జమీందారు రొచ్చి వినోదుని రెండు చేతులూ పట్టుకున్నాడు. వినోదుడు విస్మయంతో చూస్తూ ఉండి

పోయాడు. పెద్దాయన మళ్ళీ మొదలు పెట్టాడు :

"మీ అబ్బాయి గుణవంతుడే కాదు: బి. ఏ., యమ్. ఏ. కూడా ఫస్టున పాసయాడు. పైగా నీవు లక్ష లార్జిం చావు. వాడికి అనేక చోట్లనించి సంబం ధాలు వస్తూ ఉండవచ్చు. కాని, కంకణపురం ముఖర్జీలవారమ్మాయి ధనంలో గానీ, కులంలో గానీ, పరువు మర్యాదల్లోగానీ ఎవ్వరికీ తీసిపోదు. ఇంక అందంసంగతి మేము చెప్పట మెందుకు ? నువ్వు వచ్చి చూడొచ్చు."

"తమ అమ్మాయి మా యింటికి రావటం మా అదృష్టం కాదా ?" అని వినోదుడు వారికి నమస్కరిం చాడు.

ఉత్సవంతోనే వీరి తగవు రవు ల్కొన్నది; మళ్ళీ ఉత్సవంతోనే అది ఆరిపోయింది.

* * *

వివాహం అయిపోయింది, కాని, ఇంకా కొంతమంది బంధువులు ఇళ్ళకు వెళ్ళిపోలేదు. వారి పిల్లా జల్లా ఇంటి నంతా ఒక కొలికికి తెస్తున్నారు. వినోదుడు ఉదయం ఈజీచైరులో పండుకుని 'వీరి నెలా వదిలించు కుందామా' అని ఆలోచిస్తున్నాడు. ఇంతలో నౌకరు వచ్చి 'ఫౌంటెను కలం కనబడటం లే' దని చెప్పాడు. ఈ పెళ్ళిలో సరిగా వేళ కేదీ అమరక పోవటంవల్లనూ, పరిశ్రమ ఎక్కువ కావటంచేతనూ, వీరికి జ్వరం వచ్చినట్టుగా ఉంటున్నది. ఈవార్త చెవిని పడగానే మండిపోయి భార్యను పిలవమని చెప్పాడు. ఆమె రాగానే "ఆ రత్నపుర మామెనీ, సీతాపుర మామెనీ ఇవాళే వెళ్ళమని చెప్పు," అన్నాడు.

"చుట్టాలు గదా! వారంతట వారు వెళ్ళంది మన మెలా వెళ్ళమని చెప్ప గలం?" అన్నది భార్య.

"ఈ చుట్టాలని వదిలించుకోవాలనే నేను చూస్తున్నాను. నీకు పుణ్య ముంటుంది; వాళ్ళ నెలాగో సాగనంపు. అంతకీ వదలకపోతే తులమో ఫలమో చేతిలోపెట్టు. లేకపోతే ఇల్లు పడగొట్టే ట్టున్నారు"

భార్య వెళ్ళిపోయింది. గుమాస్తా వచ్చి తీర్పు నకళ్ళు యిచ్చి "నిన్న టికే కావాలన్నారు; అందుకని పైవేటు ఖర్చులు కొంచెం ఎక్కు వైనవి,'' అని వెళ్ళిపోయాడు.

ఇదొక సివిల్ కేసు నకలు. తప్పక గెలుస్తుందనుకున్న కేసు ఓడి పోయింది. ఆర్గ్యుమెంటు కూడా ఎంతో చక్కగా చెప్పాడు. వినోద బాబు తీర్పు చదవటం మొదలు పెట్టాడు. చదివినకొద్దీ ఆయన ఒళ్లు

మండిపో మొదలుపెట్టింది. అతనికి తీర్పు ఎంతో తెలివితక్కువదిగా తోచింది. జడ్జిమెంటు నకలు చింపి పారవేసి పచారు చేయసాగాడు. మేడమీద బంధువుల పిల్లలు గోలగా అరుస్తున్నారు. వినోదుడు పైవంక చూసి 'నన్ను రక్షించు భగవంతుడా, వీరినించి' అనుకున్నాడు. నౌకరు వచ్చి టపా పడవేసి పోయాడు. వినోదుడు ముందు తనకు పరిచయమున్న దస్తూరిగల ఉత్తరం సబ్ జడ్జీగారిది తాను వివాహానికి రాలేకపోయినందుకు విచారం తెలుపుతూ, వధూవరులను దీవిస్తూ ఉత్తరం ఇలా పూర్తిచేశాడు :

"ఇవ్వాళ నిన్నొకసంగతి అడుగుతున్నాను. కోపం తెచ్చుకోకు, నువ్వొకనాడు అన్నావు, జ్ఞాపకమున్నదా : మనుషుల తలమీదుగా నడవటమే లక్ష్మీదేవికి అభ్యాస మనీ! ఆమె కాళ్లు రెండూ నేలమీద కుదించుతాననీ? ఎందుకని నీవు ఏరి కోరి వాటినే యిప్పుడు నీ నెత్తిమీద పెట్టుకొన్నావు? అసలు సంగతేమంటే : ఆమె కాళ్లు అంత ఆశపుట్టిస్తవి. వాటిని నెత్తిని పెట్టుకోకుండా ఎవ్వరూ ఉండలేరు! దేవి చిందులు తొక్కటానికి ఇప్పుడు నీ నెత్తిమీద చోటు ఉందా? అంటే బట్టతల అయిందా, బట్టతల ?"

ఉత్తరంలోని మాటలు బాణాల మాదిరిగా అతని బుర్రలో నాటినవి. వెనకటి సంగతులన్నీ ఒక్కమాటుగా జ్ఞాపకం వచ్చినై. అతని ఐశ్వర్యమూ, ఇల్లూ అతన్నే హేళన చేస్తున్నట్టు తోచింది. గోడలనున్న పటాలుకూడా అతన్ని ఎత్తిపొడుస్తున్నట్టు తోచింది. రత్నపురపు ఆమే, సీతాపురపు ఆమే విజయోల్లాసంతో పకపక నవ్వుతూ అతనిచుట్టూ తాండవనృత్యం చేస్తున్నట్టుగా భ్రమపడసాగాడు!

వినోదబాబు ఇక నుంచోలేకపోయాడు గడగడ వణకుతూ కుర్చీలో కూలబడ్డాడు. జగ్గూ వచ్చి నమస్కరించి — "బాబుగారూ, సీతాపురపు పెద్దమ్మగారు వెళ్ళుతున్నారు. నేను వారివెంట పోతా," నని సెలవడిగాడు.

వినోదబాబేమీ జవాబివ్వలేకపోయాడు. అతనికి ఈ గదిలో పీల్చటానికి గాలే కరువైంది. బయటికి పోయి పడాలని చూస్తున్నాడు. కాని ఏదీ, మార్గమేదీ?